ఆస్తిపన్ను వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోండి

దుండిగల్: ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ అధికారులు కోరుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా దుండిగల్ మున్సిపల్ అధికారులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోవాలని స్థానికులకు సమాచారం అందిస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న పన్ను బకాయిలపై 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ నంబరు ఫోన్: 9542715377, రెవెన్యూ అధికారి సునంద ఫోన్: 9912971519ల్లో సంప్రదించవచ్చు.

వ్యర్థాలను తగలబెట్టే వారిపై చర్యలు తీసుకోవాలి


దట్టమైన పొగలతో ఎగిసిపడుతున్న మంటలు

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లి నుంచి బౌరంపేటకు వెళ్లే దారిలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలను తగలబెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఇక్కడ నిర్మానుష్య ప్రదేశం ఉండటంతో నిత్యం వ్యర్థాలను తీసుకోవచ్చి తగలబెడుతూ పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వ్యక్తులపై అధికారులు నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థుల నృత్య ప్రదర్శన

కుత్బుల్లాపూర్: సురారం కాలనీ రామ్‌లీల మైదానంలో శుక్రవారం కృషి హైస్కూల్ 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సురారం సీఐ వేంకటేశం, సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువులతో పాటు ఆట పాటల్లో సైతం రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రెసిడెంట్ రామేశ్వర్ రెడ్డి, శివయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు


టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విద్యావేత్త బీఎస్ఎన్ మూర్తి

చింతల్: ఒత్తిడిని జయిస్తే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని భారత్ విద్యా శిరోమణి అవార్డు గ్రహీత, విద్యావేత్త బీఎస్ఎన్ మూర్తి అన్నారు. శుక్రవారం చింతల్ డివిజన్ పట్వారి నగర్ నవజ్యోతి హై స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చైర్మన్ మలిరెడ్డి ఇందిర మాట్లాడుతూ... కష్టపడి చదివితే సాధించలేనిది ఏమీ లేదన్నారు. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు ఆదిత్యకృష్ణ, రూపాంజలి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత


చెక్కులను అందజేస్తున్న సన్న శ్రీశైలం యాదవ్

దుండిగల్: నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో కొంపల్లికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులను అందజేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ వీజేఐఈటీలో ఎథ్నిక్ డే



సంప్రదాయ దుస్తుల్లో సందడి చేస్తున్న విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో సిన్టిలేషన్ 2కే24లో భాగంగా శుక్రవారం ఎథ్నిక్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. ర్యాంప్ వాక్ నిర్వహించిన విద్యార్థుల్లో మిస్టర్ సిన్టీ, మిస్ సిన్టీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన మ్యూజిక్ క్లబ్ క్రెసెండో సభ్యులు ఆలపించిన కొంచెం హట్‌కే పాటలకు విద్యార్థులు చిందులు వేస్తూ సంతోషంగా గడిపారు.

వైభవంగా త్రయోదశ బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ త్రయోదశ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం యాగశాల ప్రవేశం, ద్వారతోరణ పూజ, అగ్నిప్రతిష్ఠ హోమం ప్రారంభం, ధ్వజారోహణ, సాయంత్రం 6 గంటలకు దేవతాహ్వానం, భేరిపూజ, ఎదుర్కోళ్ల ఉత్సవం, పెద్ద శేషవాహన సేవ, 7.30 గంటలకు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఈనెల 18వ తేదీ నుంచి పరీక్షలు


ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న ఎంఈఓ ఆంజనేయులు


బౌరంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్ఎం రాంరెడ్డి

దుండిగల్: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముందుగానే పరీక్షా కేంద్రాల వద్ద మౌళిక వసతులు కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులకు అనువుగా ఉంటే పాఠశాలలనే కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి జరిగే పరీక్షల కోసం అధికారులు సన్నద్ధమయ్యారు.

మొత్తం 55 సెంటర్లు ఏర్పాటు..

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 55 సెంటర్లను ఏర్పాటు చేశారు.
- మొత్తం 12,784 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా వారిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 1,632, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 11,152 విద్యార్థులు ఉన్నారు.
- ఒక్కో కేంద్రంలో 180 మంది నుంచి 220 మంది వరకు పరీక్ష రాయనున్నారు.

ప్రత్యేక అధికారుల నిఘా..

- నియోజకవర్గంలో మొత్తం 55 సెంటర్లు ఏర్పాటు చేయగా ఒక్కో కేంద్రానికి చీఫ్ సూపర్ వైజర్ చొప్పున 55 మంది అధికారులు, 55 డిపార్ట్‌మెంటల్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. వీరిపై రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయి.
- ఒక్కో కేంద్రానికి 12 మంది ఇన్విజిలేటర్ల చొప్పున 55 సెంటర్లకు 660 మంది పని చేస్తారు.

ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు..

- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యా శాఖ, ఆయా పాఠశాలల యాజమాన్యాలు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.
- ఎండాకాలం నేపథ్యంలో గాలి వెలుతురుతో పాటు ఫ్యాన్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మంచి నీటి వసతితో పాటు మూత్రశాలలను శుభ్ర పరిచారు.

దగ్గరలోనే కేంద్రం..

- గతంలో మాదిరిగానే ఈ సంవత్సరం కూడా జంబ్లింగ్ పద్ధతిని కొనసాగించారు.
- ఒక పాఠశాలకు చెందిన విద్యార్థులు మరో పాఠశాల సెంటర్‌కు వెళ్లి పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- అయితే విద్యార్థి చదువుతున్న పాఠశాల నుంచి కేవలం 2నుంచి మూడు కిలో మీటర్ల మేర వరకు దూరంలో ఉన్న పాఠశాలను కేంద్రంగా ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. సమయ భావం తక్కువగా ఉండడం, ట్రాఫిక్‌లో అంతరాయం లేక పోవడంతో విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకుని పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది.

ఐదు నిమిషాల నిబంధనలు..

- విద్యార్థులకు విద్యా శాఖ అధికారులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ముందస్తుగా పలు సూచనలు, జాగ్రత్తలు వివరించారు.
- ఒక రోజు ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలన్నారు.
- ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండడంతో కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచిస్తున్నారు.
- పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు సడలింపు ఇస్తు విద్యార్థులను లోనికి అనుమతి ఇస్తామన్నారు. సమయం మించిన విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని అధికారులు పేర్కొంటున్నారు.
- పరీక్షా కేంద్రానికి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమని తెలిపారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం...



ఇప్పటికే పదో తరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌళిక సదుపాయాలు కల్పించాం. విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ కేంద్రాలను పర్యవేక్షిస్తారు. ఎవరైనా మాస్ కాపియింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఆంజనేయులు, మండల విద్యాధికారి

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



ఎమ్మెల్యే వివేకానందకు మెమోంటోను అందజేస్తున్న మల్లేష్‌యాదవ్, మహేష్‌యాదవ్

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జలమండలి అధికారులు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని జలమండలి కార్యాలయంలో వేసవి కాలంలో నీటి సరఫరాపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. జంట సర్కిళ్లకు ప్రస్తుతం అందుతున్న నీటి పరిణామం, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అవసరమైన జలమండలి ట్యాంకర్ల ద్వారా బస్తీల్లో నీటిని అందించాలన్నారు. అందుకు అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, జలమండలి డీజీఎం అప్పల నాయకుడు, మేనేజర్లు రోహిణి, అనూష, రమ్యబారతి, పూజితలు పాల్గొన్నారు.

- మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపికైన రాగిడి లక్ష్మారెడ్డి పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి లోక్‌సభ ఎన్నికల్లో తన విజయానికి సహకరించాల్సిందిగా కోరారు.


వార్షికోత్సవ వేడుకల్లో నృత్యాలు చేస్తున్న నేతాజీ హైస్కూల్ విద్యార్థులు

- సుభాష్‌నగర్ డివిజన్ భాగ్యలక్ష్మి కాలనీలో శుక్రవారం నేతాజీ హైస్కూల్ 14వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సత్‌జ్ఞాన్ గ్రూప్స్ అధినేత మల్లేష్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు మహేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మినారాయణ, సాజిద్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు గొప్పవిషయం

యాదవ హక్కుల నేత ఎర్ర కార్తీక్‌యాదవ్



జగద్గిరిగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని యాదవ హక్కుల సమితి జిల్లా యూత్ అధ్యక్షుడు ఎర్ర కార్తీక్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్లుగా జాతీయ అధ్యక్షుడు రాములు యాదవ్ ఆధ్వర్యంలో ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలు, అసెంబ్లీ ముట్టడి వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆ పోరాట ఫలితమే యాదవ కార్పొరేషన్ ఏర్పాటుకు నాంది అని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నిజాంపేట్ మేయర్‌కు ఆహ్వానం

నిజాంపేట్: బాచుపల్లి కౌసల్య కాలనీకి చెందిన శ్రీవెంకట శివరామాలయ ఆలయ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శుక్రవారం మేయర్ కొలన్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 15న నిర్వహించే శ్రీసీతారామాంజనేయ, శ్రీదేవి భూదేవి సహిత శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీశివపంచాయతన, శ్రీలలితా పరమేశ్వరి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొనాలని మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.


మేయర్ నీలారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

దుండిగల్: విద్యార్థులు తమ జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని.. భవిష్యత్‌లో సమాజానికి సేవలందించాలని బౌరంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాంరెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, మదన్‌రెడ్డి, ప్రదీప్ రావు, రాజేశ్, పద్మప్రియ, రేణుక, భాస్కర్‌గౌడ్, ధన్‌రాజ్, రాజు, రమాకుమారి, రాజేందర్, మహతరాణి, సుజాత, సదాలక్ష్మి, విజయలక్ష్మి, గీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ముఖ్యఅతిథులు



డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా బోధించారు. ముఖ్యఅతిథిగా సీఎస్‌ఓ వెంకటరాములుతో పాటు డీఈఓ, ఎంఈఓ, హెచ్ఎం శివకుమార్ పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. – జగద్గిరగుట్ట

వ్యక్తి అదృశ్యం

దుండిగల్: కూలీ పనులకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గారాలమడుగు మండలం సీతారంపేట గ్రామానికి చెందిన చప్పిడి అహరోను(30)ఎనిమిదేళ్ల క్రితం కుటుంబంతో కలిసి నగరానికి వలస వచ్చాడు. గండిమైసమ్మ సమీపంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద గుడిసెలో ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. కాగా ఈనెల 12వ తేదీన కూలీకి వెళ్లిన అహరోను తిరిగి రాలేదు. అతని కోసం వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భార్య తిరుపతమ్మ దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ బైకిస్ట్ మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన హౌస్ కీపింగ్ పనులు చేసే షేక్ మహబూబ్(47) ఈ నెల 14న రాత్రి 7.30 గంటలకు హోండా యాక్టీవాపై దేవరయాంజాల్ నుంచి కొంపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం యాక్టీవాను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మహబూబ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేశారు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్: బీజేపీ రాజ్యాంగ సంస్థలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తోందని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అక్రమంగా అరెస్ట్ చేసిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కవిత అక్రమ అరెస్ట్‌పై ఆయన తీవ్రంగా స్పందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించనున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తల్లో మనోస్థైర్యం దెబ్బతీసేందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. సుప్రీం కోర్టులో కేసు నడుస్తుండగానే అక్రమంగా అరెస్ట్ చేశారని.. బీఆర్ఎస్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బీఆర్ఎస్ పార్టీపై విష ప్రచారం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే తమ పార్టీ నేతలను బీజేపీలోకి చేర్చుకుంటుందన్నారు.

దుర్మార్గపు చర్యలను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొంటాం..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని కవిత అక్రమ అరెస్ట్‌తో తేలిపోయిందన్నారు. ఆ పార్టీల దుర్మార్గపు చర్యలను ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటామని వివేకానంద్ తెలిపారు. కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ షాపూర్‌నగర్ ఉషోదయ చౌరస్తాలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

'అప్పుడు పార్క్ స్థలమన్నారు.. ఇప్పుడు చదును చేస్తున్నారు'


ఆందోళనకు దిగిన స్థానికులు

దుండిగల్: తమ విల్లాల్లోని పార్క్ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి చదును చేసి సామగ్రిని ధ్వంసం చేశారని స్థానికులు ఆందోళన చేపట్టారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని లక్ష్మి శ్రీనివాస కన్స్ట్రక్షన్స్‌లో గురువారం స్థల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. కోర్టు ఆర్డర్ ఉందని పార్క్ స్థలాన్ని చదును చేసి ఆట వస్తువుల సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. గతంలో తాము విల్లాలు కొనుగోలు చేసిన సమయంలో పార్క్ స్థలంగా చూపించారని.. ఇప్పుడు సదరు స్థలాన్ని చదును చేశారని.. తమకు న్యాయం చేయాలని నిరసన తెలుపుతున్నారు.

ప్రార్థన సంపతిని వరించిన అమిస్టెడ్ కిరీటం


మిస్ టీన్ గ్రాండ్ యూనివెర్సో రన్నరప్‌గా నిలిచిన ప్రార్థన సంపతి

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివానీ విద్యా సంస్థల అధినేత కుమార్తె ప్రార్థన సంపతి మిస్ అమిస్టెడ్ కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. గత నెల 27న సౌత్ అమెరికాలోని కొలంబియాలో జరిగిన మిస్ టీన్ గ్రాండ్ యూనివెర్సో అందాల పోటీల్లో ప్రార్థన సంపతి ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. అంతే కాకుండా మిస్ అమిస్టెడ్ కిరిటం పొందిన తొలి ఆసియా దేశీయురాలిగా గుర్తింపు పొందారు. శుక్రవారం కొంపల్లిలోని కళాశాలకు చేరుకున్న ఆమెను కళాశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. డ్యాన్స్‌లు చేస్తూ మేళ తాళాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. దీంతో కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రార్థన సంపతి మాట్లాడుతూ దేశం తరపున పోటీల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. రన్నరప్‌గా నిలిచినా తానే విజేతగా భావిస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివశివాని విద్యా సంస్థల ఎండీ డాక్టర్ శైలేష్ సంపతి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, కళాశాల డైరెక్టర్ రమణారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మమత, స్కూల్ ప్రిన్సిపాల్ శారదా, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ మదన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య కోర్సుల దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) ఆధ్వర్యంలో దూరవిద్యా కోర్సులకు దరఖాస్తు గడువును పెంచారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా బ్లెండెడ్ మోడ్ ద్వారా అందించే ఒక సంవత్సరం డిప్లొమో కోర్సుల కోసం దరఖాస్తులను కోరుతోంది. ఈ కోర్సులు యూజీసీ, ఏఐసీటీఈ, డీఈసీ జాయింట్ కమిటీచే ఆమోదించబడిన కోర్సులు ఉన్నాయి. మరిన్ని వివరాలకు వెబ్ సైట్ నుంచి ప్రాస్పెక్టస్ డౌన్ లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పేజీ రసీదుతోపాటు సెక్షన్ ఆఫీసర్ సెంటర్ ఫర్ డిస్టెన్ అండ్ వర్చువల్ లెర్నింగ్‌కి పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 040–24600264, 040–24600265లో సంప్రదించాలి.

నిద్రమత్తులో డ్రైవింగ్ చాలా ప్రమాదకరం



రాయదుర్గం: నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని (వరల్డ్ స్లీప్ డే)ను పురస్కరించుకొని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ విభాగం, 50 మంది తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉన్నతోద్యోగులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు నిద్ర మత్తులో వాహనాలను నడపడం వల్లనే భారత దేశంలో 40 శాతం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించేందుకు డ్రైవర్లంతా నిబంధనలకు అనుగుణంగా వాహనాన్ని నడిపేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన కల్పిస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్, ఆర్టీసీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. శైలజామూర్తి, డాక్టర్ పి శ్రీనివాస్ మాట్లాడారు. ఏఎన్‌సీ ఇన్స్టిటిక్ ఉపాధ్యక్షుడు అరుణ్‌బోడ, ఇతర సంస్థల ప్రతినిధులతో బాటు వైద్యులు పల్మనాలజిస్ట్ అండ్ స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ నళిని నాగళ్ళ, న్యూరో సర్జన్స్ డాక్టర్ అజయ్‌రెడ్డి, డాక్టర్ రణధీర్‌కుమార్, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.